ఈనాడు
epaper.eenadu.net



## ఇకపై ఎక్కడా

# ఆక్రమణలు జరగొద్దు

### ఓఆర్ఆర్ లోపల చెరువులు, నాలాల వివరాలు సేకరించాలి

- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తించాలి
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- అర్హులైన పేదలకు రెండు పడకగదుల ఇళ్లు లేదా ప్రత్యామ్నాయం చూపించాలి
- దసరాలోపు కేంద్రానికి మెట్రో విస్తరణపై డీపీఆర్
- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

ఈనాడు - హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలో అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) లోపల ఉన్న ప్రతి చెరువు, నాలాల్లో ఆక్రమణల వివరాలు సేకరించాలని, అంతటా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తించాలని, సంబంధిత పూర్తిస్థాయి నివేదికను ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇకపై ఎక్కడా ఆక్రమణలకు గురికాకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని, అన్ని చెరువుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని అన్నారు. ఆక్రమిత చెరువులు, నాలాలతో పాటు మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న అర్హులైన పేదల వివరాలు సేకరించాలని చెప్పారు. ఆయా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి రావద్దని, వారికి రెండు పడకగదుల ఇళ్లు కేటాయించాలని లేదా మరో ప్రత్యామ్నాయం చూపించాలని ఆదేశించారు. దసరాలోపు మెట్రో విస్తరణ మార్గానికి సంబంధించి పూర్తిస్థాయి డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాలని సూచించారు. ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గానికి సంబంధించి పూర్తిస్థాయి నివేదిక రూపొందించాలన్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పురపాలక ముఖ్య కార్యదర్శి దానకిశోర్, మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

...మిగతా 2లో

ఈనాడు
epaper.eenadu.net

# ఇకపై ఎక్కడా ఆక్రమణలు జరగొద్దు

(మొదటి పేజీ తరువాయి)

"అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణను బాధ్యతగా చేపట్టాలి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని వాటిని కాపాడుకోవాలి. ఇకపై చెరువులు, నాలాలు ఆక్రమణలకు గురికాకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలి. అదే సమయంలో నిజమైన, అర్హులైన పేదలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి. పాత బస్తీ మెట్రో విస్తరణ పనులను వేగంగా చేపట్టాలి. మెట్రో మార్గాలకు సంబంధించిన భూసేకరణ, ఇతర అడ్డంకులుంటే వాటిపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి, పరిష్కరించాలి" అని సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట సహా మెట్రో విస్తరణకు సంబంధించి పలు అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు.

Date : 25/09/2024 EditionName : GREATER HYDERABAD PageNo :